# నెలాఖరు కథ

—వెంపటి సత్యసూర్యనారాయణ

రామారావు వాచీకేసి చూసుకున్నాడు. అయిదయింది. చూస్తున్న ఫైలు పక్కన పడేసి ఆఫీసు నుంచి బయలుదేరి రోడ్డున పడ్డాడు. పనిచెయ్యాలనే ఉత్సుకత రామారావుకి ఈ రోజున ఏ మాత్రము లేకపోయింది. కారణం... ప్రొద్దుట్నుంచి ఒక్క కాఫీ కూడా తాగలేదు. ఒకటవ తారీఖుకి మధ్యలో యింకా ఒకరోజు మిగిలింది. మార్చినెల. అంటే 32 రోజుల నెల. ప్రొద్దుట పద్మ తొందరగా రమ్మని చెప్పినమాట యింకా చెవుల్లో మ్రోగుతోంది.

నడుస్తూ నడుస్తూ ఆగిపోయాడు. రామారావు మొహంలో రంగులు మారిపోతున్నాయి. న్యూస్ పేపర్లు గుర్తుకొచ్చాయి. మళ్ళీ ఈరోజు పది నిమిషాలు మానభంగం లాంటిది తప్పదనుకున్నాడు.

"ఏమైందిరా?" వెనకాలే సైకిలు మీద వస్తున్న మూర్తి ఎంక్వైయిరీ.

"ఏమౌతుందోయ్ ? చెప్పుతెగింది" రామారావు హెల్ప్‌లెస్‌గా మాట్లాడాడు,

"సరే అయితే నేను వెడతాను. అర్జంటుగా అబిడ్స్‌కి వెళ్ళాలి. నువ్వు నెమ్మదిగా చెప్పు కుట్టించుకుని ఇంటికి వెళ్లు" అని సలహా ఇచ్చి వెళ్లి పోయాడు మూర్తి. అతనికి తెలుసు, ఇటువంటి సందర్భంలో పక్కనుండడం ఏ మాత్రం శ్రేయస్కరం కాదని, పని పెట్టుకుని వెళ్ళిపోతే పరువైనా దక్కుతుందని. ఎందుకంత భయం మూర్తికి? చెప్పుతెగిన రామారావు చెప్పుచ్చుకు కొడతాడనా? కాదు. చెప్పు కుట్టించుకొనేందుకు చిల్లర పైసలడిగితే? నెలాఖరు. మూర్తి జేబులో ఐదు పైసలు కూడా లేవు. రామారావు జేబులో వుంటుందనే నమ్మకం లేదు.

కనుమరుగయ్యేంత వరకూ కన్నార్పకుండా చూశాడు రామారావు. ఆ తరువాత తనింటికి వెళ్లాలని గుర్తుకొచ్చింది. కాని చెప్పు తెగిపోయింది. చెప్పులు చేత్తో పట్టుకుంటే తొందరగా ఇల్లు చేరచ్చు. కాని చాలా పొద్దుంది. అందరూ చూస్తూవుంటే చెప్పులు చేత్తో పట్టుకొని నడవడం ఎలా? చుట్టూ ఒకసారి చూశాడు, చెప్పులు కుట్టేవాడు లేడుకదా అని. వుంటే (చెప్పు కుడతాను రమ్మంటే) వాడి దగ్గర కూడా తను అవమానం పొందవల్సిందే కదా! బరువెక్కిన గుండెతో ఈడ్చుకుంటూ టాంక్‌బండ్ దాకా చేరాడు. పద్మ తన కోసం ఎదురు చూస్తుంటుంది. ఆఫీసుకి బయలుదేరుతుంటే గుమ్మంలో నిలబడి నెలలో కనీసం చివరి రెండు రోజులైనా తొందరగా రమ్మని చెప్పింది. ఎందుకంటే నెల మొదటిరోజు తను షికారుకెళ్ళడని తెలుసు. కానీ తనకీరోజు తొందరగా వెళ్ళాలని లేదు. వెళ్ళలేడు. వెళ్దామన్నా చాలాదూరం. చిక్కడపల్లిదాకా చెప్పీడ్చుకుంటూనడవాలి. సాయంత్రంపూట బస్సులో వెళ్ళడం తనకలవాటే లేదు కదా!

రామారావు గత జీవితాన్ని, పెళ్ళయిన రోజుల్ని అనుకూలవతియైన భార్యని, తన జీతాన్ని, తను ఆమెకు తెచ్చిపెట్టలేని సుఖాల్ని తలుచుకుంటూ టాంక్ బండ్‌మీది బెంచీమీద కూర్చుండిపోయాడు ఆలోచిస్తూ. తనొక గవర్నమెంటు గుమాస్తా. ఆర్డినరీ గుమాస్తా. నెలాఖరులో న్యూస్‌పేపర్లు అమ్ముకుంటేగాని గడవని గుమాస్తా. ఆకాశాన్నంటే ధరలకీ ఆకలికీ మధ్య

దూరం తెలిసిన గుమాస్తా. ఎన్నెన్నో కలలు కన్న కన్నె మెడలో తాళి కట్టిన గుమాస్తా. ప్చ్. తప్పదు. ఈ రోజు మళ్ళీ న్యూస్ పేపర్లు అమ్మేయవలసిందే. అంటే తన పరువుని బజారులో పెట్టుకోవాలన్న మాట. మామూలు మనుషుల్లాగే ఆ పని చేయడంలో అవ మానం కలుగుతుందనే ఫీలింగు, నామోషి. తన టెర్లిన్ షర్ట్ కేసి ఒక్కసారి చూసుకున్నాడు. వెక్కి రిస్తున్నట్లా అనిపించింది. ఆ టెర్లిన్ షర్ట్ తన కుటుం బానికి కలిగే ఒడిదుడుకులకు ఖరీదైన పరదా. దాని వెనక తానెన్నెన్నో దాచాడు. అది వేసుకొంటే దుఃఖాన్ని దిగమింగగలడు. బాధలను బయటపెట్టుకో కుండా వుండగలడు. తన భార్య అనందానికి తన జీతం యిచ్చిన రేషన్ కార్డుని దాచగలడు. చాకలి ఖర్చులు తగ్గించగలడు. కాని ఆ టెర్లిన్ షర్టే ఇవాళ ఇప్పుడు తను అమ్మేయవలసిన న్యూస్ పేపర్లకోసం కుట్టించిన టెర్లిన్ సంచిలా అనిపిస్తోంది. తను టెర్లిన్ సంచులున్నంత గొప్పవాడు. న్యూస్ పేపర్లు అమ్ముకో వలసినంత బీదవాడు. ప్చ్. తప్పదు. పది నిమిషాలు బయట ప్రపంచం మర్చిపోయి, పాలుతాగే పిల్లిలా, కళ్ళు మూసుకుని గబగబా దొంగలా గేటుదాటి కట్ట కట్టి కొట్లో పడేయాలి. నాలుగు రూపాయల నలభై పైసలు తెచ్చుకోవాలి. చెప్పు కుట్టించుకోడానికి 20 పైసలు, కాఫీ మానేసినా సిగరెట్లకి రూపాయి. పంచదార లేదేమో? కూరలు తేవాల్లేమో? బహుశః సరిపోవచ్చు. అవన్నీ అక్కర్లేకపోతే రెండుమూడు రూపాయలు మిగలచ్చు.

లేద్దామనుకున్నాడు. కాని చెయ్యవలసిన కర్మ కాండ నామర్దా అనిపించింది. ఏదో తెలియని కారణా నికి కోపం వచ్చింది. పద్మ పంచదార లేదంటుందా? లేదంటే సాచిపెట్టి కొట్టాలి. నెల మొదట్లోనే నెలపొడు గునా కావలసిన సరుకులు తెప్పించుకోక్కర్లే? కూరలు తేవాలంటుందా ? భోజనం దగ్గర గొడవచేసి లేచి పోవాలి. ఇంకా...వాచీ చూసుకున్నాడు. ఏడయింది చుట్టూ చూసాడు. చీకటి పడిపోయింది. తొందరగా వెళ్ళాలి. పద్మ......తనకోసం ఎదురు చూస్తుండ వచ్చు. లేచి ఇంటిముఖం పట్టాడు.

* * *

ఆరేళ్ళ కుర్రాడు, నాలుగేళ్ళ అమ్మాయి కూర్చుని శ్రద్ధగా చదువు కుంటున్నారు. పద్మ లోపల వంట చేస్తూంది. రామారావు చెప్పులో మూల పారేసి కుర్చీలో కూలబడ్డాడు.

"పద్మా ఏంచేస్తున్నావు ? ఓ కప్పుకాఫీ తీసుకురా" పిలిచినట్లే అరిచాడు రామారావు.

"రాజా కాఫీ లేదని చెప్పు" పద్మకి కోపం వచ్చిం దని రామారావుకి ఇట్టే తెలిసిపోయింది.

అన్నం కుతకుతా వుడుకుతోంది. ఎందుకో తెలియకుండానే పద్మ కళ్ళల్లో నీళ్ళుతిరుగుతున్నాయి. తను ప్రేమించే భర్త. తనను కోరి చేసుకున్న భర్త. ఆతని సాన్నిధ్యంలో కూర్చుని అరగంటసేపైనా హాయిగా గడపాలనుకుంది. అందుకే ప్రొద్దుట ఆఫీ సుకి వెళ్ళేటప్పుడు తొందరగా రమ్మని చెప్పింది. పెద్దపెద్ద ఆభరణాలు కొనివ్వలేకపోయినా తన ఆ చిన్న కోరికను కూడా మన్నించలేకపోయాడు.

రామారావుకి ప్రొద్దున్నించి కాఫీ తాగలేదేమో నోరు లాగుతూంది. చిరాగ్గా వుంది. కాఫీ పొడి లేదేమో నని లేచి వంటింట్లోకి వెళ్ళి కాఫీ పొడి లేదా అని అడి గాడు.

"వుంది కాని కాఫీ టైము దాటిపోయింది." అంది పద్మనిక్కచ్చిగా.

"ఇవ్వనోయ్ కాఫీకేమైనా టైము రాసిపెట్టుందా?" రామారావు గద్దించాడు.

"ఎనిమిది గంటలకా కాఫీ ? కావలిస్తే పెట్టుకోండి నాకు చెయ్యాలని లేదు." పద్మ అన్నేళ్ళ సహ చర్యం వలన సంపాదించిన అనుభవంతో తనకుకలిగిన

అసంతృప్తికి అలాగే బదులుగా తీర్చుకోవాలనుకుంది. రామారావు వెళ్ళి మళ్ళీ కుర్చీలో కూలబడ్డాడు.

"ఈ పూట కూరొండటం లేదు" పద్మ సంసార పక్షంగా మాట్లాడింది.

"పోనీలే. చారుపెట్టు."

"చారే పెట్టగలిగితే కూరే వండేదాన్ని. ఉప్పు లేదు."

"ఎన్నిసార్లు చెప్పాలి కొంచెం వుండగానే సరుకు తెప్పించుకోమని?"

"ప్రొద్దున్నే చెప్పానుగా. ఆఫీసు నుంచి వచ్చేటప్పుడు ఉప్పు పొట్లం తేడానికి కూడా నామోషీయేనా ?" తనదే పై మాటగా మాట్లాడింది పద్మ.

రామారావు ఔటైపోయాడు.

చదువుకుంటూ చదువుకుంటూ రాజా ఏదో గుర్తు కొచ్చినట్లా తలెత్తి

"నాన్నా పెన్నులో సిరా అయిపోయింది. ఒక ఇంక్ బాటిల్ కావాలి" తన ఇండెంట్ కూడా పెట్టేశాడు.

"చాల్లేవోయ్ చదివావ్. రెండో క్లాసు కుర్రాళ్ళకుకూడా పెన్నులూ,సిరాలూ. పెన్సిల్‌తో రాసుకో"

"పెన్సిల్ లేదు. ఐదు పైసలిస్తే పెన్నులో సిరా పోయించుకుంటాను" రాజీకి వచ్చేసాడు రాజా.

"చదివావులే. ఈ పూటకి పడుకో రేపిస్తాను" హామీ ఇచ్చినట్లే అన్నాడు రామారావు. ఒక సిగరెట్ తీసి వెలిగిద్దా మనుకున్నాడు. అగ్గి పెట్టెలో పుల్లల్లేవు.

"వంటింట్లోకి వెళ్ళి అగ్గిపెట్టె తెచ్చి పెట్టమ్మా రోజా" అన్నాడు కూతురుతో.

"వంటింట్లో అగ్గిపెట్టె ముట్టుకుంటే వళ్ళు చీరేస్తాను" వరదల్లో గోదావరికి ఆనకట్టలా అడ్డుచెప్పింది పద్మ. రామారావుకి తన ఫండమెంటల్ రైట్‌ని కాదన్నట్లు అనిపించింది. సిగరెట్ కాల్చడం తన ఫండమెంటల్ రైట్. ఆఫీసులో రోజూ రెండు కాఫీలు తాగేవాడు. ప్రొద్దుట్నించి ఈవేళ ఒక్క కాఫీ కూడా తాగలేదు. కనీసం సిగరెట్ కాల్చడానికి కూడా కాన్స్టిట్యూషన్ ఎమెండ్ చేసినట్లా మాట్లాడుతుంటే వళ్లు మండింది రామారావుకి. కోపంతో కళ్ళుఎరుపెక్కాయి. ఒక్కటి సాచిపెట్టి కొట్టాలనుకున్నాడు

ఉప్పు తేవాలని గుర్తు చేసింది భార్య.

చెప్పులు తెగిపోయాయి. కుట్టించితేగాని రేపు నెలాఖరు రోజున ఆఫీసుకి నడచి వెళ్దామన్నా సాధ్యం కాదనిపించింది. కనీసం ఈ రెండు ముఖ్యావసరాలకైనా ప్రతి నెలాఖరులో తాను రెగ్యులర్‌గా చేసే పని......అదే తనకున్న ఒకే ఒక ఎస్సెట్ న్యూస్ పేపర్లు తీసికెళ్ళి ఇచ్చేయాలి. భార్యని పిలిచి బొత్తు పెట్టి సంచీలో పెట్టమన్నాడు. అలాగే చేసింది. అగ్గిపెట్టె తెమ్మన్నాడు ఇవ్వనంది. రామారావుకు కోపం కట్టలు తెంచుకొస్తోంది.

"ఇలా పేపర్లు కనిపించేటట్లు ఈ సంచిలో పెట్టద్దని ఎన్నిసార్లు చెప్పాలి ?" మరుక్షణంలో పద్మ చెంప ఛెళ్ళుమంది! ఆ సంచిలోంచి తీసి మరో సంచిలో పెట్టాడు టెర్లిన్‌షర్ట్ విప్పేసి కాటన్ చొక్కా తొడుక్కున్నాడు. బయటకొచ్చి రెండు పక్కలకి చూసాడు. పక్కవాళ్ళెవరూ చూడట్లేదుకదాని. గేటుదాకా వెళ్ళి రెండు పక్కలకి చూసాడు. తన ఆఫీసు వాళ్ళెవరూ అటు పోటల్లేదు కదా అని. అటు నుంచి చారి వస్తున్నాడు. తటతటాయించాడు. చారి దగ్గరికి వచ్చాడు.

"హల్లో చారి! ఎక్కడికి ? ఆ ఎయిర్ బాగ్ ఏమిటి?"

"రాజమండ్రి వెడదామని"

"ఏదేనా పెళ్ళి చూపులకా?"

"అబ్బే కాదు..."

"అయితే ఈ నెలాఖరులో ఎందుకు ? జీతం తీసుకుని వెళ్ళచ్చుగా... అయినా క్రిందటి నెలకూడా

నెలాఖరులో ఇలాగే పూరు వెడుతున్నా నన్నావు. మర్నాడు ఆఫీసుకి వచ్చావు?"

చారి ఇక రహస్యం దాగదనుకున్నాడు. రేపు ఆఫీసులో కనబడితే? 'బట్టలు లాండ్రీకి వేస్తున్నాను' అనవలసిందను కున్నాడు.

"అబ్బే నడవండి చెప్తాను" అంటూ రామారావుతో పాటు లోపలికి నడిచాడు.

"చూడండి రామారావుగారూ, పెద్ద పెద్ద ఆఫీసర్ల, మనలాటి గుమాస్తాల నెలాఖరు రోజుల జీవిత రహస్యం ఇది. ఇందులో వున్నవి బట్టలు కావు, న్యూస్ పేపర్లు. నే వెడుతువ్నది రాజమండ్రి కాదు, ఇవి అమ్మేయడానికి. అఫ్‌కోర్స్! చాలామంది ఇలా నెలాఖరులో చెక్కులు మార్చుకున్నట్లు మార్చుకోవచ్చునవే పేపరు కొంటారు. మీలాంటి ఫామిలీలున్న వాళ్ళకి పరవాలేదనుకోండి. హోటళ్ళ మీద అధారపడిన మా లాంటి బాచిలర్స్‌కి న్యూస్‌పేపర్లు అమ్మేస్తే కాని నెలాఖరులో గడవదుగదా? నేను చేసే పనికి సిగ్గుపడను కాబట్టి ఇలా చెప్పేస్తున్నాను. అయినా వీలైనంత వరకూ ఎవరికీ తెలియనివ్వకూడదని ఇలా ఎయిర్ బాగ్‌లో పెట్టి తీసుకెడుతున్నాను.

రామారావు తన చేతి కేసి చూసుకున్నాడు పద్మ లోపల బాధపడుతూ వుంటుంది. తను చేసిన పనికి తనే తిట్టుకున్నాడు. 'నడు బ్రదర్' అంటూ తను కూడా లేచాడు సంచీ చేత్తో పట్టుకుంటూ. పద్మ లోపలి నుంచి చూస్తూ వుంది. భర్త చెప్పులు వేసుకోకుండానే వెళ్ళిపోతున్నాడు. కొంత సేపటికి కాని అర్థంకాలేదు, ఆ రోజు అతనెందుకు ఆలస్యంగా వచ్చాడో. వీధి గుమ్మంలోకి వచ్చి అలాగే నిలబడిపోయింది. రెండు కన్నీటి బొట్లు ఆమె చెంపల మీదుగా జాలువారాయి. రామారావు తెచ్చిన మల్లె పూవులు పద్మ చేతుల్లో పెట్టే టప్పటికి తేరుకుంది. ఆమె మనసు పువ్వులంత తేలికయింది. □

దేశాభిమానం నాకు కద్దని, వొట్టి గొప్పలు చెప్పుకోకోయి!
పూని యేదైనాను వొక మేల్, కూర్చి జనులకు చూపవోయి!

— గురజాడ